**కథ** — శివల పద్మ

# సార్థకం

**కాలింగ్‌బెల్ శబ్దం వినగానే కిచెన్లో గ్యాస్ స్టవ్ శుభ్రం చేస్తున్న సువర్చల చేతులు కడుక్కుని నేప్‌కిన్‌తో తుడుచుకుని వచ్చి తలుపు తీసింది.**

**ఎదురుగా పూర్ణిమ..ముద్దుల మేనకోడలు!**

**“హాయ్ అత్తయ్యా! ఏం చేస్తున్నావ్? అప్పడాలు, వడియాలూ, టమాటా పచ్చడి..” వేళాకోళంగా అంటూ లోపలికి వచ్చింది.**

“బాధ్యతలు రాలేదు కనుక నీకు వేళాకోళంగానే ఉంటుంది. వస్తే తెలుస్తుంది” ఆమె వెనుకే తలుపు గడియపెట్టి లోపలికి వచ్చింది.

శుభ్రంగా కడిగిన గాజు గ్లాస్‌లో నీళ్ళు అందించింది సువర్చల.

నీట్‌గా అలంకరించిన ఆ గది ప్రశాంతమైన ఆ వాతావరణంలో పూర్ణిమకు హాయిగా అన్పించింది. సువర్చల ఇల్లుని అద్దంలా ఉంచుతుంది. కాస్తంతయినా దుమ్ము పడనివ్వదు దేనిపైనా. కడిగిందే కడిగి, తుడిచిందే తుడిచి ఏదో చేస్తూనే ఉంటుంది.

“ఏమిటి విశేషాలు? నీ పనులు ఎలా సాగుతున్నాయి?” ఆప్యాయంగా అడిగింది.

“దివ్యంగా..నేనొచ్చింది నీతో చిన్న పని పడి..నిన్నే రిక్వెస్ట్ చేద్దామని”

“ఏమిటో..”

“నీకు చాలా దగ్గరగా ఉన్న స్లమ్ ఏరియాలో పిల్లలకి వారానికోసారి కొన్ని ముఖ్యమైన అంశాల మీద తరగతులు తీసుకుంటున్నాము. ఆటలు, పాటలు, వ్యాయామం వంటివే కాకుండా శుచి, శుభ్రతా, మంచి అలవాట్లు, దేశ భక్తి వంటి అంశాల మీద వారికి చిన్న చిన్న విషయాలు తెలియచెప్పాలి అన్నది మా ప్రయత్నం. నేను నిన్ను కోరేది ఏమిటంటే ఒక గంటకోసం వచ్చి ఆ పిల్లలకు రాగయుక్తంగా శ్లోకాలు నేర్పించి వెళ్ళమని. నీ గొంతు బాగుంటుంది. పైగా నీకు ఎన్నో శ్లోకాలు వచ్చు”

“నేనా?” ఇబ్బందిగా చూసింది సువర్చల.

“ఏంటత్తా! అలా ముఖం పెడతావు? పేరంటం అంటే వెళ్ళవా? సత్యనారాయణవ్రతం అంటే వెళ్ళవా? పక్కనే ఉన్న బస్తీకి వారంలో ఒక గంట నీ సమయం ఇవ్వలేవా?”

“అది కాదే..వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు..పిల్లలు..మామయ్య..”

“సరేలే...వచ్చేవాళ్ళు వస్తూనే ఉంటారు. పోయేవాళ్ళు పోతూనే ఉంటారు. ఇదేమీ ఒక్క రోజుతో తీరిపోయేది కాదుగా..పాతికేళ్ళ నీ వైవాహిక జీవితంలో దీన్లో మార్పు ఎప్పుడు వచ్చింది చెప్పు? ప్లీజ్ అత్తా! కొంచెం సమయం..”

“నేను మాట ఇవ్వలేనే..నా పని సంగతి నీకు తెలియదు. ఒక్క పావుగంట నేనింట్లో లేకపోతే ముగ్గురికి ముగ్గురూ నానా కంగారు పడిపోతారు. మీ మామయ్య అయితే మరీను” కాస్త సంశయం కాస్త మురిపెం కలగలిపి చెప్పింది.

పూర్ణిమకి జాలిపడాలో బాధపడాలో అర్థం కాలేదు.

అది ఆధారపడడం కాదు, మనిషిని అన్ని విధాలా వాడుకోవడం అని ఈ వెర్రి ఇల్లాలికి ఎప్పుడు అర్థం అవుతుంది?

“అలా కాదత్తా! నీ పనులకి నేనేం ఆటంకం కలిగించడం లేదు కదా! మామయ్యకి చెప్పి ఒప్పించు. వాళ్ళు ఆఫీస్ నుంచి వచ్చేలోగా నువ్వింట్లో ఉంటావు కదా!”

“సరేలే..చూస్తాను” అంది సువర్చల.

★ ★ ★

“నీకు రెండు రోజులై చెపుతున్నాను. ఆ లైట్ బ్లూ షర్ట్ ఉతికి ఇస్త్రీ చేయించి ఉంచమని. నా షేవింగ్ క్రీమ్ అయిపోవచ్చింది. ముందుగా కొని ఉంచక్కర్లేదూ? ఏమైంది నీకు? ఏ పనీ సరిగ్గా జరగడం లేదు. ఎప్పుడూ ఇంతే”

మనస్సు చివుక్కుమంది సువర్చలకి. ఒకటి రెండు విషయాలు మరిచిపోతే- ఎప్పుడూ అంతేనా? మరి ఇన్నాళ్ళు చేసింది? చేస్తున్నది?

“అదేమిటలా అంటారు. ఇన్ని పనులు ఉన్నచోట ఒకటి రెండు మిస్ అవుతాయి. నేనేం మిషన్‌ని కానుగా”

“ఒకటి రెండేమిటి? ఏనాడు నువ్వు సవ్యంగా అన్నీ చూసుకున్నావు కనుక?”

మరో శరాఘాతం!

“నేనేం లోపం చేసాను? ఇల్లు సంసారం తప్ప వేరే నాకు ఏముంది?” ఉక్రోషంగా అడిగింది.

“అదేదో ప్రపంచంలో నువ్వొక్కదానివే చేస్తున్నట్లు అలా బాధ పడిపోతావేమిటి? పెళ్ళయిన ఏ ఆడదయినా ఇదే చేస్తుంది. ఇంకేం చేస్తుంది? ప్రత్యేకంగా ఏం చేసేసావు నువ్వు?”

“ఏమిటో మమ్మీ! నీకు చాదస్తం ఎక్కువైపోతోంది. అది కూడా కాదు- సెల్ఫ్ పిటీ డెవలప్ చేసుకుంటున్నావు ఏదో కష్టపడిపోతున్నట్లు నువ్వు చేస్తున్నది నువ్వు తప్ప ఎవరూ చేయనట్లు.. ఇల్లు ఆఫీస్..ఇల్లు బిజినెస్ మానేజ్ చేసుకుంటున్న వాళ్ళు ఎంతోమంది ఉన్నారు తెలుసా? అసలు ప్రపంచాన్ని నువ్వేం చూసావని?”

తను ప్రపంచంలోనికి తెచ్చిన కొడుకు తనకి ప్రపంచం తెలియదు అంటూ ఉంటే నివ్వెరబోయింది సువర్చల!

ఒకటి కాధు రెండు కాదు-పూర్తిగా పాతికేళ్ళ జీవితాన్ని వీరికి అర్పించింది.

భర్తా, పిల్లలూ, సంసారం తప్ప మరో ప్రపంచం అనేది లేకుండా గడిపింది.

అసలు జన్మకి పరమార్థం ఏమిటి అనే ఆలోచనకు కూడా తావివ్వకుండా దీనికోసమే జన్మ ఎత్తినట్లుగా..

వారంతా వెళ్ళిపోయాక అన్యమనస్కంగా అనిపిస్తుంటే డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి సోఫాలో చొరబడింది.

ప్రతిరోజూ వీళ్ళు ముగ్గురూ చిన్న చిన్నగా ఏదో ఒకదానికి విసుక్కుంటున్నా తనెప్పుడూ పట్టించుకోలేదు. కానీ ఈరోజు మాత్రం ఎందుకో కాస్త ఎక్కువగానే హర్ట్ అయినట్లనిపిస్తోంది.

అసలు జీవితం ఏమిటి?

మొదటిసారిగా తనను తాను ప్రశ్నించుకుంది.

పెళ్ళి, భర్తా పిల్లలు, వారికి సేవలు..ఇంకా ఆయుష్షు ఉంటే మనుమల సేవలు..శరీరం శిథిలమైపోయాక ఒక రోజు దాన్ని వదిలేయడం..ఇదేనా?

మూసుకున్న కళ్ళముందు గడచిన జీవితం కదిలింది. చంటిపిల్లలు, జబ్బులు, ఆలనాపాలనా..ఎన్నో నిద్రలేని రాత్రులు..నిద్ర ముంచుకొస్తున్నా అర్ధరాత్రి లేచి పాలు కలిపి పట్టి...తనకీ శరీరం ఉంది. దానికీ రవ్వంత విశ్రాంతి కావాలి అన్న విషయం కూడా మరిచి.

కొన్ని వందలసార్లు కత్తిపీటతో కూరలు తరుగుతున్నప్పుడు వేలు తెగితే..ఆ చేత్తోనే పచ్చడి రుబ్బుతూ ఉంటే ఆ మంటకి కళ్ళనీళ్ళు తిరిగేవి..ఎవరితోనూ చెప్పలేదే..

తొందరలో గిన్నె దింపుతుంటే చేతులు కాలి ఒక పూటంతా మంట పెడుతున్నా నోరు విప్పి అబ్బా అని కూడా అనలేదే..

నూట మూడు డిగ్రీల జ్వరంతో ఉన్నా వీళ్ళ చదువుకున్నప్పుడు లేచి టీ పెట్టి ఫ్లాస్క్‌లో పోసి ఇచ్చేది.

కాస్తంతయినా కన్‌సర్న్ లేదే..

షోకేస్‌లో చీర చూసి మనసు లాగుతున్నా, ఎదుగుతున్న పిల్లకన్నా నాకవసరమా అని దానికే పట్టులంగాలు కొనేదే..

ప్రాణంలా పెంచిన తండ్రి చనిపోతే మనసారా ఏడవడానికి కూడా నోచుకోలేదు. బావగారి కూతురికి గాజులు పెట్టించి పేరంటం చేయాల్సి వచ్చింది.

మనసు ఒంటరితనం కోరుతుంటే వేడుకలు చేయాల్సి వచ్చింది. ఆరోజు ఎవరైనా తన బాధ అర్థం చేసుకున్నారా?

ఇన్నేళ్ళ జీవితంలో ఇదిగో..ఈ ప్రబుద్ధుడికి పెళ్ళాంగా..ఈ గాడిదలకి తల్లిగా తప్పిస్తే తనకో వ్యక్తిత్వం

అఘోరించిందా?

ఎవరికోసం ఈ జీవితాన్ని మనస్ఫూర్తిగా సంతోషంగా అర్పించిందో వాళ్ళే ఈరోజు నువ్వు మా కోసం ఏం చేసావు? అంటున్నారు.

అసలు తనకంటూ ఏముందీ జీవితంలో.

ఇరవై నాలుగ్గంటలూ ఏడు రోజులు న్యూస్ ఛానల్‌లా అలా వీళ్ళకి చేయడంలోనే గడిపేసింది తప్ప ఏ వెన్నెల రాత్రయినా అరగంట ఒంటరిగా గడపగలిగిందా?

తనకిష్టమైన ప్రదేశాలకి నిశ్చింతగా వెళ్ళగలిగిందా?

ఆఫీస్‌ల్లో చేసేవాళ్ళకి హాలిడేస్, ఆదివారాలు ఉంటాయి. కానీ గృహిణికి శలవు రోజనేది ఒకటి ఉంటుందా జీవితంలో?

ఒక్కసారి..ఒక్కసారంటే ఒక్కసారి తన మనసులో ఏముందో వీళ్ళెప్పుడైనా తెలుసుకునేందుకు ప్రయత్నించారా?

ఎముకలు కొరికే చలిలో ఇంకా ఇంకాసేపు బ్లాంకెట్ కప్పుకొని పడుకుంటే బాగుండునని ఎంతగా అనిపిస్తున్నా బలవంతాన లేచి వీరికి టిఫిన్లు, వంట చేసేదే..వీళ్ళెవరూ ఎనిమిది వరకూ పక్కలు దిగకపోయినా ఆ సమయానికి అన్నీ సిద్ధంగా ఉంచేది కాదా?

ఒక్కసారి వెనుతిరిగి చూస్తుంటే ఇవేవీ కూడా తను బాధపడుతూ చేయలేదు. చేస్తున్నది తనవారికే కదా అనే తృప్తి మనస్ఫూర్తిగా చేసేది. బదులుగా సన్మానాలు సత్కారాలు అక్కర్లేదు. కనీసం ఆప్యాయంగా ఓ చిన్నమాట. 'నువ్వు మాకోసం కష్టపడ్డావు' అన్న చిన్నమాట తనకెంత తృప్తినిచ్చేది.

కానీ అది కూడా వీళ్ళకి మనసులో లేదు. నేడో రేపో తాను చావడానికి సిద్ధంగా ఉంది. జీవితం ముగిసిపోతుంది కూడా.

అప్పుడు ఈ జీవితం దొరికినందుకు ఏం చేసానని తనని తాను ప్రశ్నించుకుంటే ఏం సమాధానం ఉంది?




ఇల్లు శుభ్రంగా ఉంచుకున్నాను..మొగుడికీ పిల్లలకీ వెట్టి చాకిరీ చేసాను అనా? ఇదేనా జీవితానికి పరమార్థం?

భగవంతుడు ఇంత ఉత్తమమైన మానవ జన్మనిస్తే దాన్ని ఏం సార్ధకం చేసుకుంది తను? కిచెన్ తలుపు తెరవడంతో రోజు ప్రారంభం అవుతుంది. తిరిగి బెడ్‌రూమ్ తలుపు మూయడంతో రోజు ముగుస్తుంది. నెలలూ సంవత్సరాలూ అలాగే గడిచాయి.

ఈ జీవితం తనది..దీన్నెలా గడుపుతుందో తను నిర్ణయించుకోవాలి. ఎవరి జీవితాన్ని ఎవరూ అందంగా ఆదర్శవంతంగా మార్చలేరు. ఎవరి జీవితం వారి చేతుల్లోనే ఉంటుంది. వారు తీసుకునే నిర్ణయాల బట్టే వారి జీవన రథం సాగుతుంది. మొగుడునీ పిల్లలనీ చూసుకోవడం సంసారం చేయడం తప్ప ఆడదాని జీవితానికి అంతకన్నా ముఖ్యం ఏదీ లేదు అనే భావన గల వాతావరణంలో పెరిగింది. అందుకే జీవితం ఇంత దివ్యంగా తగలడింది.

ఊహూ..సగం జీవితం ఎలానూ గడిచిపోయింది. కనీసం శేష జీవితానికైనా ఓ సార్ధకత ఏర్పరచుకోవాలి. మనిషిగా పుట్టినందుకు అద్భుతాలు సృష్టించకపోయినా కనీసం చివరి క్షణాల్లో తన వలన ఏదైనా మంచి పని జరిగిందనే తృప్తైనా మిగలాలి. అలా జరగని నాడు భగవంతుడిచ్చిన ఈ అపురూప వరాన్ని ఈ అవకాశాన్ని నిరర్ధకం చేసుకున్నట్లే.

★ ★ ★

"హలో పూర్ణిమా!"

"ఆ అత్తా! చెప్పు..ఏమిటి ఫోన్ చేసావు?"

"మా దగ్గర బస్తీలో పేద పిల్లలకు స్కూలు నేనే నడుపుతాను. ఆ బస్తీ ఒకసారి చూపించు"

"వాట్! ఏమంటున్నావు? నేను సరిగ్గానే విన్నానా?"

"సరిగ్గానే విన్నావు. కనీసం పోయేముందైనా నా జీవితానికో అర్థం ఏర్పరుచుకోనీ"

★ ★ ★

"ఏమిటీ? నువ్వు ఆ స్లమ్‌కి పోయి పిల్లలకి పాఠాలు చెపుతావా? ఇదేమిటీ నిర్ణయం? పైగా అది మంచినీళ్ళు వచ్చే టైమ్..నువ్వింట్లో లేకపోతే ఎలా కుదురుతుంది?"

"పనిమనిషిని పెట్టండి. నీళ్ళు నింపి ఉంచుతుంది. పాతికేళ్ళుగా నేను చేస్తున్న ఈ పనులు ఎవరైనా చేయగలుగుతారు. దానికి నేనే అవసరం లేదు. కానీ నేను మాత్రమే చేయగలిగే పనులు నాకు సంతృప్తినిచ్చే పనులు కొన్ని చేయాలనుకుంటున్నాను. మనిషిగా పుట్టాను కనుక.." స్థిరంగా చెప్పింది సువర్చల.

★